క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 10, వంకాయ 18, బెండ 35, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 18, దొండ 15–23, చిక్కుడు 45–55, గోకర 45, బీట్‌రూట్ 18, క్యాప్సికం 45, ఆలు 19, దోస 23, సొర 9, పొట్ల 18, ఉల్లి 14 చామగడ్డ 45. మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్

చాదర్‌ఘాట్: ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నట్లు వాణి అకాడమీ డైరెక్టర్ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 19 లోపు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో నేరుగా లేదా ఫోన్ నం. 9550170234లో సంప్రదించి పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కలిసి కట్టుగా పండుగలు జరుపుకోవాలి



ముస్లిం సోదరులకు పండ్లను తినిపిస్తున్న రాంమోహన్‌గౌడ్

లింగోజిగూడ: మతాలకు అతీతంగా పండుగలను కలిసి కట్టుగా జరుపుకోవాలని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ అన్నారు. సరూర్‌నగర్ గాంధీబొమ్మ చౌరస్తాలోని మసీద్ ఏక్ ఖానాలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో రాంమోహన్‌గౌడ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఖాజభాయ్, షౌకతుద్దీన్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను కాలనీ సంఘాలు పర్యవేక్షించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాల ప్రకారం జరిగేలా కాలనీ సంక్షేమ సంఘాలు పర్యవేక్షించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల మరమ్మతుల పనులను మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈ నరేంద్రతేజతో కలసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందచారి, సత్యనారాయణ, అరుణ్, లక్ష్మణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్రం: సీపీఐ



సింగరేణి కాలనీలో కరపత్రాలు పంచిన ఐఎస్‌సదన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్

సైదాబాద్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఐఎస్‌సదన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ ఆరోపించారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఆయన సీపీఐ నాయకులు, కార్యాకర్తలతో కలిసి బీజేపీ హటావో–దేశ్ కో బచావో పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా మహమూద్ మాట్లాడుతూ, పేదోడిని కొట్టి గొప్పోనికి పెట్టు అనే తరహాలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నిస్తున్న కమ్యూనిస్టు నాయకులను అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీని ఎన్నికల్లో ఓడించేందుకు కమ్యూనిస్టు నాయకులు అందరం పోరాడతామన్నారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, అమీన, రాజు, దశరథ్, అజయ్, రేష్మ, అజీం పాల్గొన్నారు.

వీఓఏలతో సర్కార్ వెట్టిచాకిరి: సీఐటీయూ

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు దాటినా.. వీఓఏల బతుకులు మారలేదని, చాలీచాలని జీతాలు ఇచ్చి వారితో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మార్నింగ్ వాక్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లవారు జామున హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సుజాతా నాయక్ , కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం కోటి 77లక్షల రూపాయల నిధులను మంజూరు చేశామన్నారు. ఆ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీ సమస్యతోపాటు పార్కుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని, టీకేఆర్ బస్టాపు దగ్గర ట్రంక్‌లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ట్రంక్‌లైన్ ఏర్పాటు చేసి డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. పార్కులలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి సుందరంగా తీర్చి దిద్దుతానని, నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజక వర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని, అభివృద్ధిలో భాగంగా ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ హేమూనాయక్, హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, ఓరుగంటి వెంకటేశ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆదిలక్ష్మి, అనిత, నాగిరెడ్డి, రోహిత్‌రెడ్డి, గోపిమధు, సాయియాదవ్, మహేందర్, బీమ్లాల్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్, అరుస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎన్‌ఐఎంహెచ్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించిన అగ్నిమాపక సిబ్బంది

సైదాబాద్: అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఎన్‌ఐఐఎంహెచ్) సిబ్బందికి ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ సూచించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖల ఆదేశాల మేరకు సైదాబాద్ రెవెన్యూబోర్డ్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన ఫైర్ సర్వీసెస్ వీక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫైర్‌సేఫ్టీ ఇంటిగ్రేటర్ అధ్యక్షుడు కృష్ణమోహన్ 'జాతీయ మౌలిక సదుపాయాల వృద్ధికి అగ్ని భద్రతపై అవగాహన–రాష్ట్ర పరిశీలన' అనే అంశంపై సిబ్బందికి వివరించారు. సదస్సు అనంతరం అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు బిస్వోరంజన్ దాస్, వి.శ్రీదేవి, అష్ఫాక్ అహ్మద్, సంతోష్ శాంతిలాల్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వెంకటసాయిరెడ్డి

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో ఉండే వెంకటసాయిరెడ్డి(17) ఇంటర్ పూర్తి చేశాడు. ఈ నెల 14న ఇంట్లో ఎవరు లేని సమయంలో తన బ్యాగులో జత బట్టలు పెట్టుకుని బయటికి వెళ్లిన ఇతను తిరిగి రాలేదు. దీంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు సమీప బంధువులు, స్నేహితులను వాకబు చేసినా వెంకటసాయిరెడ్డి ఆచూకీ తెలియరాలేదు. దీంతో సోమవారం తల్లి చంద్రకళ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం కొత్తపేట డివిజన్‌లోని సత్యానగర్ కాలనీ, ఎస్‌ఆర్‌ఎల్ వాసులతో కలిసి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇన్‌టెన్సివ్ శానిటేషన్ –ఆర్‌డబ్ల్యూఏ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని కాలనీల్లోని రోడ్లు, డ్రైనేజీ శానిటైజేషన్, దోమలు, నీటి సమస్యలు రాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మృతనాయక్, శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, జలమండలి అధికారి అరీఫ్, సత్యనారాయణ, సత్యనగర్ కాలనీ అధ్యక్షుడు శుక్ల, కార్యదర్శి రమణ, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్, కుమార్ ఇతర కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

లింగోజిగూడ: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ లక్ష్మీప్రియ కాలనీలో జైశాలిని(34) భర్త కుమార్ గుప్తాతో కలిసి ఉంటోంది. భర్త కుమార్ గుప్తా పని నిమిత్తం ఛత్తీస్‌ఘడ్ వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న జైశాలిని సోమవారం మధ్యాహ్నం సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జైశాలిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

హయత్‌నగర్‌లో యువకుడు...

లింగోజిగూడ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ జయప్రకాష్‌కాలనీలో నివాసం ఉండే విష్ణు కుమారుడు రాపాని శివ(28) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివ ఇంట్లోని ఐరన్ రాడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయటానికి కృషి చేస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధి లంబాడీ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేయించి, తాగునీటి వ్యవస్థ మెరుగుపరుస్తామన్నారు. విద్యుత్ దీపాలు, కేంద్రంలోని ఫర్నిచర్‌కు మరమ్మతు చేయిస్తామన్నారు. బస్తీలోని గర్భిణులు, మహిళలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.


రాఘవేంద్ర కాలనీ సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న భాస్కరరావు, కాలనీవాసులు

చంపాపేట: చంపాపేట డివిజన్ రాఘవేంద్ర కాలనీలో మౌలిక సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఓగిరాల భాస్కరావు ఆధ్వర్యంలో సోమవారం సర్కిల్ నోడల్ అధికారి వీరస్వామికి వినతి పత్రం అందచేశారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సర్కిల్ అధికారులు, వాటర్ వర్క్స్, విద్యుత్ సిబ్బంది సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. లో ప్రెషర్‌తో తాగునీటి సరఫరా, తరలించని చెత్త కుప్పలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు వంటి సమస్యలతో తాము సహజీవనం చేస్తున్నామని సిబ్బంది ముందు వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అధికారులు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు అంజయ్య, కొండలరావు, ఆనంద్, సర్కిల్ సిబ్బంది శివ, శ్రీహరి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

హస్తినాపురం: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుష్మా థియేటర్ పక్కన ఉన్న బార్ ముందు ఉన్న పాన్ డబ్బా పక్కన గుర్తు తెలియని (65) సంవత్సరాల వృద్ధుడు పడి ఉండి ఉండగా, ఆటో డ్రైవర్ నక్క యాదగిరి గమనించాడు. ఇరుగు పొరుగు వారిని పిలిచాడు. అతడిని చూసిన వారు స్థానికంగా యాచిస్తూ జీవించే వ్యక్తిగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్యులు సామాజిక సేవలో ముందుంటారు



నూతన కమిటీ సభ్యులతో సుధీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

లింగోజిగూడ: ఆర్యవైశ్యులు సామాజిక సేవా దృక్పథంలో ఉంటారని, కరోనా కాలంలో ప్రాణాలు లెక్క చేయకుండా భోజనాలు, బియ్యం, కూరగాయాలు పంపిణీ చేశారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మీకన్వెన్షన్‌లో నిర్వహించారు. సంఘం నూతన గౌరవ అధ్యక్షుడిగా బిళ్లకంటి కిరణ్ కుమార్, అధ్యక్షుడిగా అనంత రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రమాకాంత్, కోశాధికారిగా లింగేషగుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పద్మనారాయణతో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు గుడి, బడితో పాటు అన్నదానాలు చేయడంలో ముందుంటారని అన్నారు. కర్మన్‌ఘాట్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని అడిగారని, ఎక్కడైనా ప్రభుత్వ స్థలం ఉంటే తప్పకుండా కేటయిస్తానని తెలిపారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మహాసభ సభ్యత్వం తీసుకోవాలని, కర్మన్‌ఘాట్‌లో వైకుంఠ రథం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తన వంతుగా రూ.లక్ష అందజేస్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు, నాయకులు రేణిగుంట గణేష్, లక్ష్మణ్, అలంపల్లి శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, వెంకటేష్, నగేష్, మహేశ్, మోహనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హస్తినాపురం: గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ గ్రామ పరిధిలోని ఆపిల్ ఎవెన్యూలోని ఓ ఇంట్లో పేకాటాడుతున్నారన్న పక్కా సమాచారంతో సోమవారం ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పేకాటాడుతున్న ఎ.శ్రీనివాస్, ఆదాటి కుమార్, ఆదాటి భాస్కర్‌సాగర్, చింతల శ్రీను, ఉట్కూరి నాగరాజు, తిమ్మనగారి కృపాకర్‌రెడ్డి, కొలుగూరి యాదయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ. 37.350లు స్వాధీనం చేసుకుని వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధుల

ఎల్‌బీనగర్: బీఎన్ రెడ్డి డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ ఫేస్– 04 కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం స్థానిక కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ...కాలనీలో త్రీఫేజ్ కరెంట్ సదుపాయం లేకపోవటంతో లో ఓల్టేజ్‌తో సరఫరా అవుతోందన్నారు. అలాగే, అసంపూర్తి దశలో ఉన్న తాగునీటి పైప్‌లైన్ సమస్యతో పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యలన్నింటినీ సాధ్యమైనంత తొందరలో పరిష్కరిస్తానని తమకు హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న పెండ్యాల నగేష్, అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. సోమవారం వారు ఎన్టీఆర్‌నగర్‌లోని మసీదులో ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బీరెల్లి వెంకట్‌రెడ్డి, మారోజు రామాచారి, ముప్పిడి లింగస్వామిగౌడ్, కొండ్ర శ్రీనివాస్, ఎంఏ సాజీద్, జగన్మోహన్‌రెడ్డి, దుబ్బాక శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



కామినేని చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కూడళ్ల వద్ద జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పలువురు నేతలతో కలిసి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కామినేని చౌరస్తా, నాగోలు చౌరస్తా, మోహన్‌నగర్ చౌరస్తా, కొత్తపేట ఓమ్ని హాస్పిటల్ చౌరస్తా, నాగార్జునసాగర్ చౌరస్తా, బైరామల్‌గూడ అంబేద్కర్ విగ్రహం వద్ద ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు మేకల సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్, ప్రకాష్ గుప్తా, బుడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ వాహన ర్యాలీకి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఫైర్ ఆఫీసర్ ఎండీ ముస్తాఫా, జగన్‌గుప్తా తదితరులు

మలక్‌పేట: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిపమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో వాహన ర్యాలీ నిర్వహించారు. గౌలిగూడ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్న ర్యాలీకి మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్ద మలక్‌పేట ఫైర్ ఆఫీసర్ ఎండీ ముస్తాఫా నేతృత్వంలో ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాద ఘటన వివరాలు చెప్పేటప్పుడు కంగారు పడకుండా ప్రశాంతంగా చెప్పాలన్నారు. సమాచారం ఇచ్చేటప్పుడు పూర్తి చిరునామా, ల్యాండ్ మార్కులు చెప్పాలని సూచించారు. స్వాగతం పలికిన వారిలో ప్రముఖ వ్యాపారవేత్త, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచికంటి జగన్‌గుప్తా, నాయకులు మహేష్‌కుమార్, వెంకట్, నర్సింగ్, సందీప్, కిరణ్, వెంకటేష్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం



అక్బర్‌బాగ్ మొగల్ మార్ట్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. చెత్తను క్రమంగా తొలగించకపోవడం వలన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త కుప్పలు పేరుకుపోయి పలు కాలనీలు అపరిశుభ్రంగా మారాయి. ఆంధ్రాకాలనీ పార్కు వెనుక, అక్బర్‌బాగ్ మొగల్ మార్ట్ చౌరస్తాలో, బీ–బ్లాక్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ప్రధాన కూడళ్లు కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులకు ఈ సమస్య తలనొప్పిగా మారింది. ఆహార పదార్థాలు, వ్యర్థాలు కుళ్లిపోయి కంపుకొడుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులంటున్నారు. శానిటేషన్ విభాగం అధికారులు చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పేరుకుపోయిన చెత్తను క్రమంగా తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం : ఎమ్మెల్యే



కంటి వెలుగు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్రంలోనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ క్రాంతి క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...గతంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు పరిచిన కంటి వెలుగు కార్యక్రమం వల్ల కంటి చూపు మందగించిన లక్షలాది పేదలు చూడ గలుగుతున్నారని అన్నారు. వారి ఆదరణతోనే రెండవ దఫా కంటి వెలుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో 83518 మందిని కంటి వైద్యనిపుణులు ఉచితంగా పరీక్షించగా 13892 మందికి కంటి అద్దాలను, 13739 మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్ ఇచ్చారన్నారు. మరో 4254 మందిని కంటి ఆపరేషన్ల కోసం సరోజినీదేవి అసుపత్రికి పంపించారన్నారు. కర్మన్‌ఘాట్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రం జూన్ 15 నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫిజికల్ డైరెక్టర్లకు దరఖాస్తుల ఆహ్వానం

హుడాకాంప్లెక్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు అర్హులైన శిక్షకుల నుంచి కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వరరావు సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడా కారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. శిబిరం నిర్వహించిన వారికి రూ.4వేల గౌరవ వేతనంతో పాటు క్రీడా సామగ్రిని అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల శిక్షకులు క్రీడాంశం, క్రీడా ప్రాంగణ ప్రదేశం, సెల్ నంబర్‌తో దరఖాస్తును ఈ నెల 27వ తేదీ లోపు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.